సమస్యలు పరిష్కరించాలని వినతి


జలమండలి జీఎం అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ మేకల సునీత జలమండలి జీఎం అశోక్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవికి ముందే గౌతంనగర్ డివిజన్‌లో నీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. అన్ని కాలనీలకు రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా చేయాలని, అలాగే బోర్‌వెల్స్‌కు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, బైరు అనిల్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు టెండర్లు పిలవాలి


జలమండలి జీఎంతో కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి టెండర్లు పిలవాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి కోరారు. ఈ మేరకు జలమండలి మేనేజర్ సంతోష్‌కుమార్‌ను గురువారం కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయని పనులు త్వరగా చేపట్టాలని విన్నవించారు.

పంచలోహ విగ్రహాల అందజేత

కుషాయిగూడ: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక బీఆర్ఎస్ నేత పాండాల శివకుమార్‌గౌడ్ శివపార్వతుల పంచలోహ విగ్రహాలను కాటమయ్య ఆలయానికి అందజేశారు. బుధవారం రాత్రి జరిగిన కల్యాణ మహోత్సవంలో కుటుంబ సమేతంగా విగ్రహాలను ఇచ్చారు.


విగ్రహాలతో పాండాల శివకుమార్‌గౌడ్ దంపతులు


గర్భాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు


యాగశాలలో కలశపూజ చేస్తున్న వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు


స్వామివారి నందివాహనసేవలో భక్తులు


ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద భక్తులు


రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ..

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- కీసరగుట్టలో నాలుగో రోజుకు వేడుకలు
- భక్తుల ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజ
- రాత్రి వైభవంగా విమానరథోత్సవం



కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు వేదపండితులు గురువారం ఉదయం స్వామి సన్నిధిలో గర్భాలయంలోని స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం పూజ చేశారు. మరోవైపు ఆలయం పక్కన గల యాగశాల్లో టీటీడీ వేద పాఠశాల పండితులు గణపతిశర్మ, వేద విద్యార్థులతో కలిసి రుద్ర స్వాహాకార హోమాన్ని నిర్వహించారు. అలాగే సాముహిక అభిషేకాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు ప్రదోషకాల పూజ, హారతి, మంత్ర పుష్పం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి 8 తర్వాత కొండ దిగువన గల పార్క్ సమీపంలో స్వామివారికి విమాన రథోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ రథానికి పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. తెల్లతామర కొలను వరకు కొనసాగిన రథోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

◆ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో కీసరగుట్టకు తరలివచ్చారు. స్వామిదర్శనానంతరం ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో గల శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు. కాగా మహాశివరాత్రి అర్ధరాత్రి లింగోద్భవకాలంలో గర్భగుడిలో స్వామివారికి వేద పండితులు వైభవంగా సంతతధారాభిషేకం చేశారు. ఆలయం ఎదురుగా శివలింగాలు ఉండడంతో భక్తులు కూడా పూజలు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేటి పూజలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు (శుక్రవారం) ఆలయంలో పలు పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5.30 నిమిషాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాముహిక అభిషేకాలు, (కల్యాణ మండపంలో) ఉదయం 7 గంటలకు అన్నాభిషేకం, రాత్రి 7కు ప్రదోషకాలపూజ, హారతి, మంత్రపుష్పం, రాత్రి 8 గంటలకు వసంతోత్సవం, పుష్పయాగం, పూజలు నిర్వహించనున్నారు.


కీసరగుట్టలో దర్శనానికి బారులు తీరిన భక్తులు


శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


కీసరగుట్టలో స్వామివారి విమాన రథోత్సవంలో భక్తులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని సూర్యనగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మల్లాపూర్ ఏఈ నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శక్తిసాయినగర్, సూర్యనగర్, ఉదయ్‌నగర్, మల్లికార్జున్‌నగర్ గుల్మోర్ గార్డెన్, చండీయానగర్, గోకుల్‌నగర్, బ్యాంక్ కాలనీ, జీఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో..

బోడుప్పల్: ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో శుక్రవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ వేణుగోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ద్వారకానగర్ ఫేస్ 1, 2, కేశవనగర్, గాయత్రీనగర్‌ల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి సమస్యలు


కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బొంతు శ్రీదేవి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న చర్లపల్లి శ్మశానవాటిక, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, బాక్స్‌డ్రైన్, యూజీడీ, ఎస్ఎన్‌డీపీ పనులు త్వరగా చేపట్టాలని అలాగే పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆమె పేర్కొన్నారు.

కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ ఓల్డ్ నేరెడ్‌మెట్, దినాకర్‌నగర్, కేశవ్‌నగర్‌లో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు శానిటేషన్ విభాగంపై పలు ఫిర్యాదులు చేశారు. చెట్ల కొమ్మలు కొట్టివేసిన తర్వాత తొలగించడం లేదన్నారు. అలాగే పలు వీధుల్లో వీధి దీపాలు లేవని, ఏర్పాటు చేయాలని వారి దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ స్పందిస్తూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ద్వారా చెత్తాచెదారాన్ని తొలగిస్తామన్నారు. ప్రజలు కూడా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చెత్త సేకరణ రిక్షా కార్మికులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రవణ్

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మల్లాపూర్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మల్లాపూర్ శాంతి యూత్ క్లబ్ ఎస్వీ శశి ఆధ్వర్యంలో మున్సిపల్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన చాందిని క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసం, శారీరక దృఢత్వానికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో శాంతియూత్ క్లబ్ అధ్యక్షుడు కొల్లూరి రవికుమార్, ప్రధాన కార్యదర్శి కొయ్యల కొండ రాజేశ్, ఉపాధ్యక్షుడు రఘు, నిర్వాహకులు శ్రీనివాస్, బండి సంపత్, పీఆర్, మెహ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'వదంతులు నమ్మొద్దు'

అల్వాల్: గుడ్డు, చికెన్‌లో శరీరానికి కావాల్సిన పోషకాలు లభిస్తాయని, వదంతులు నమ్మొద్దని అల్వాల్ చికెన్ షాప్ ఓనర్స్ అసిసోయేషన్ వారు విజ్ఞప్తి చేశారు. అల్వాల్ లక్ష్మీకళామందికర్ థియేటర్ వద్ద గురువారం చికెన్ మేళా నిర్వహించారు. ఉడకబెట్టిన గుడ్లను, ఫ్రై చేసిన చికెన్ పదార్థాలను పంపిణీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో గుడ్లు, చికెన్ తినడం వల్ల మనుషుల ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగదని, అందుకే చికెన్ మేళా ఏర్పాటుచేసి వినియోగదారులకు అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కొండల్, కోశాధికారి కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు తెలిపారు.


చికెన్ మేళా నిర్వహిస్తున్న దృశ్యం

అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలి

బోడుప్పల్: మహారాజులు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని మాదిగ జాగృతి సంఘం కోఆర్డినేటర్ జనార్దన్ మహారాజు అన్నారు. దేవేందర్‌నగర్ కాలనీలో మాదిగ జాగృతి సంఘం సభ్యులు గురువారం సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులస్తులు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అలాగే ఎంజేఎస్ కమిటీ నిర్మాణంపై చర్చించారు. అనంతరం మాదిగ జాగృతి సంఘం 2025 కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమేశ్ మహారాజు, యాదగిరి మహారాజు, బాలస్వామి మహారాజు, రాంచందర్ మహారాజు పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

అల్వాల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మచ్చబొల్లారం మల్లికార్జున దేవస్థానం సర్వేశుని గుట్ట వద్ద మల్లన్న స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, అల్వాల్ కార్పొరేటర్ శాంతి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వినయ్‌కుమార్, నర్మద, ఎల్లేశ్, సంధ్య, మహేశ్, పావనీ, నాయకులు డోలి రమేశ్, జగదీశ్‌గౌడ్, సూర్యప్రకాశ్, పవన్, శ్రీనివాస్, శోభన్, సతీశ్, రాజు పాల్గొన్నారు.

లోతుకుంట విజయ గణపతి ఆలయంలో..

లోతుకుంట విజయ గణపతి ఆలయంలో లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. బలవంతరెడ్డి, కన్నా, శేఖర్, నరహరి, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

అన్నదానం..

టెంపుల్ అల్వాల్ నీలకంఠేశ్వర మంగళాదేవి శివాలయం వద్ద సురేశ్ ఎలక్ట్రికల్స్ అండ్ సాండ్స్ నిర్వాహకులు సురేశ్, రవిల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానాలు నిర్వహించారు. రమాదేవి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

జయగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో..

గౌతంనగర్ జయగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

ఉప్పల్‌లో ..

ఉప్పల్: అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర ఆలయంలో గురువారం కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ మేకల దయాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు చాడ వాణిశ్రీ, అనూప్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సిద్దేశ్వర శర్మ సమక్షంలో కల్యాణాన్ని జరిపించారు.


సర్వేశుని గుట్ట మల్లన్న ఆలయంలో పూజల్లో మాజీ ఎంబీసీ చైర్మన్, కార్పొరేటర్

అలాగే ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా ఈదమ్మ గుడి ప్రాంగణంలోని ఈ ఆలయం స్థాపించి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా పలు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చర్ల సుధాకర్ రెడ్డి, సుధాకర్ శెట్టి, సర్వే ఆఫ్ ఇండియా అధికారులు గోపాలాకృష్ణ, శ్రీనివాస్, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ సర్కిల్ పరిధిలో..

రామంతాపూర్ : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఆలయాల్లో బుధవారం రాత్రి ఉంచి గురువారం వేకువ జామున వరకు భక్తుల ఉపవాస దీక్ష విరమణ, జాగరణ శివపార్వతుల కల్యాణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

వినాయకనగర్‌లో..

మౌలాలి: వినాయకనగర్‌లో బుధవారం రాత్రి వీర భారతీ సేనా, వీహెచ్‌పీ నేత ఉడత నవీన్ ఆధ్వర్యంలో శివరాత్రి జాగరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో జాగరణ కొనసాగించారు. అలాగే శివలింగానికి బీజేపీ సంస్థాగత ఎన్నికల కో-రిటర్నింగ్ అధికారి, మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, ప్రవచన కర్త సూర్యనారాయణమూర్తి, భక్త బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.


సత్యదేవుని ఆలయంలో కల్యాణం..


విజయ గణపతి ఆలయంలో కల్యాణం..


ఉప్పల్ కాశీ విశ్వేశ్వర ఆలయంలో కల్యాణం..


వినాయక్‌నగర్‌లో జాగరణలో నాయకులు

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

మేడ్చల్: కోర్టు, లోకాయుక్తకు తప్పుడు నివేదికలు ఇచ్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని గౌడవెల్లి గ్రామానికి చెందిన నాయకుడు నరేందర్‌రెడ్డి రాష్ట్ర సీఎస్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. మేడ్చల్ మండలం గౌడవల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి ఎవాక్యు ప్రాపర్టీ సర్వే నంబర్లు 331/1-2, 352, 364/1-2, 365/1-2 లో గల 29.24 ఎకరాల భూమిపై క్రయ విక్రయాలు నిషేధిస్తూ 22అ రిజిస్టర్‌లో చేర్చగా 12 ఏళ్లుగా మేడ్చల్ తహసీల్దార్, ఆర్డీఓ పనిచేసిన అధికారులు ఈ భూమిపై ఉన్నతాధికారులకు, కోర్టులు, లోకాయుక్తకు తప్పుడు నివేదికలు ఇచ్చి కబ్జాదారులకు సహకరించి సుమారు రూ. 300 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యేందుకు కారణమయ్యారని ఆరోపించారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

నేడు జైళ్లశాఖ సిబ్బందికి సామగ్రి పంపిణీ

చంచల్‌గూడ: తెలంగాణ జైళ్ల శాఖ ఆధునీకరణలో భాగంగా సిబ్బందికి ఎలక్ట్రానిక్ గ్యాడెట్లు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11.30 గంటలకు చంచల్‌గూడలోని సీకా ఆడిటోరియంలో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు డైరెక్టర్ వీవీ శ్రీనివాస్‌రావు ప్రారంభిస్తారని అధికారులు వెల్లడించారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. వేంకటేశ్వరనగర్ రాఘవేంద్రస్వామి మఠం వద్ద పవర్ బోర్ మరమ్మతులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని నిరుపయోగంగా ఉన్న పవర్‌బోర్లకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో డీజీఎం రమేశ్, మేనేజర్ నవీన్, నాయకులు బాబు, కిశోర్, బ్రహ్మయ్య తదితరులు పాలొన్నారు.


పవర్‌బోర్ మరమ్మతును పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

ఘట్‌కేసర్‌కు అఖండ జ్యోతి రథం



ఘట్‌కేసర్: యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బర్కత్‌పుర యాదగిరి భవన్ నుంచి యాదాద్రికి బయలుదేరిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి అఖండ జ్యోతి రథం గురువారం ఘట్‌కేసర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ఘన స్వాగతం పలికారు. అఖండ జ్యోతి రథం శనివారం ఉదయం వరకు యాదాద్రికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడిపై కేసు

మలక్‌పేట: గంజాయి విక్రయిస్తుండగా ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్న ఘటన మలక్‌పేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి వివరాల ప్రకారం.. తలాబ్ కట్టా ప్రాంతంలోని జిషాన్ స్కూల్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు ఎస్టీఎఫ్ పోలీసులు దాడులు చేసి సయ్యద్ మగ్దుమ్(21)ను పట్టుకుని 1.4 కిలోల గంజాయితో పాటు రూ.70,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. మగ్దుమ్‌తో పాటు మహ్మద్ వాజీద్, ఎండీ జావేద్‌పై కేసు నమోదు కాగా ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

